"వాడికి నిన్ను గార్డియన్‌గా పెట్టినట్టు మనం ఎప్పుడూ అనుకోలేదు. కాని మా తమ్ముడు మెడిసిన్ మూడోయేడాది మూడోసారి తప్పిన యేడాది నువ్వు అక్కడికి ట్రాన్స్‌ఫర్ అవడంవల్ల నువ్వు వాణ్ణి ఒకదార్లో పెడతావని ఆశపడ్డాను;

# బాబుల భగవద్గీత

## భమిడిపాటి రామగోపాలం



ఆమాట నీకు నేను స్వయంగా మీవూరొచ్చి చెప్పానుకూడానూ. అటు తిరిగి యిటుతిరిగి నువ్వు వాణ్ణి బాగుచైదంపోయి నువ్వూ వాడితోబాటు బార్‌లకి వెళ్ళి వాడికి పెద్ద దిక్కవడం నుంచి వాడికి కంపెనీ యిచ్చేస్తున్నావని తెలిసి నేనెంత బాధపడ్డానో తెలియడానికే యీ వుత్తరం. వాడు ఎలాగా చెడిపోయాడు నువ్వుకూడా చెడిపోతున్నావని బాధపట్టుకుంది నాకివాళ—" అని ఇంకా ఏమిటేమిటో రాసేడు సత్యనారాయణ.

సత్యనారాయణ తమ్ముడు పరమహంస పదమూడేళ్ళబట్టి ఈ వూళ్ళో మెడిసిన్ చదువుతున్నాడు. అంటే ఎం.డి., ఎం.ఎస్. అలాంటివన్నీ చేసేసి ఏదో స్పెషలైజేషను చేస్తున్నాడని కాదు. మామూలుగా ఆరేళ్ళు చదవవలసిన ఎం.బీ బీ.యస్.నే పదమూడో యేడు చదువుతున్నాడు.

వాళ్ళన్నయ్య నా క్లాసుమేటు. పరమ హంసని అతనే చదివిస్తున్నాడు.

మొదట్లో రెండేళ్ళు బాగానే చదివాడు పరమహంస. ఆ తరువాత అతనికి మెడిసన్‌మీద అభిరుచి పోయింది. కారణం ఇదీ అని నేను చెప్పలేను. కాని అతను మంచి ఏక్టరై పోతాడని అందరికీ అతనికి కూడా ఆశ కలగడమే కారణం అని నిర్ధారణ అయిపోయింది. ఎందుకంటే మూడో యేడాదిలో వుండగా రాష్ట్రంలో వున్న మెడికల్ కాలేజీలన్నిటిమధ్య ఒక నాటకాల పోటీ జరిగింది. అందులో ఉత్తమ నటుడుగా బహుమతిని గెల్చుకున్న పరమ హంస. ఆ తరవాత మెడికల్ కాలేజీ

నాటకాల్లోనే కాక రకరకాల యితర నాట కాల్లో కూడా వేషాలువేసి, మంచి నటుడని ఖ్యాతి సంపాదించుకున్నాడు. ఈ పదేళ్ళమధ్యా అతను ఒక వంద నాటకాల్లో వేషాలువేసి డాక్టరవడంకంటె ఏక్టరవడం తనకీ జనానికీ మంచిదనే నిర్ణయాని కొచ్చేశాడు.

ఎందుకంటే, మొన్నీ మధ్య మా జిల్లాలో నటులందరూ పాల్గొన్న ఒక బ్రహ్మాండమైన నాటక మహోత్సవాల్లో ప్రముఖ పాత్ర వహించి, ఆ సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికలో తన్ను తాను పరిచయం చేసుకుంటూ రాసిన వాక్యాలు ఇవి—

"వైద్య వృత్తిగాని ఈ కోర్సులో చేరడంగాని నా అభిరుచి కాదు. పదమూడేళ్ళ కిందట పి. యు. సి.లో నాకు వొచ్చిన మార్కులనుబట్టి మా బంధువులు నాకు నిర్ణయించిన జీవిత మార్గం అది. మైనర్లై ఉన్నప్పుడు నా జీవిత మార్గాన్ని ఎంచి పెట్టిన మా బంధువుల అభిరుచి కన్నా; మేజరయ్యాక జీవితం అంటే అర్థం అవడం ప్రారంభించేక నాకుగా నేను ఎంచుకున్న అభిరుచి నాకు ముఖ్యం కదా. నేను మంచి నటనను స్టేజిమీద విజయవంతంగా ప్రదర్శించగలనని మోహమాటస్తులే కాక నిర్మోహమాటస్తులు కూడా వొప్పుకుంటున్నారు. ఈలోపుని మెడికల్ కాలేజీలో చదువుతూ వుండడాన్ని ఆసుపత్రికి దగ్గరగా అతుక్కుపోయి వుంటూ, వైద్య వృత్తిని శాస్త్ర దృష్ట్యానేకాక కళా దృష్టితో కూడా గమనించగలిగాను. ఎన్నాళ్ళో పరిచయం వుంటే గుణాలకంటె దోషాలే ఎక్కువ కనబడతాయన్న సూత్రం ప్రకారం, అనుభవంతో తెలుసుకున్న సత్యం ఏమిటంటే వైద్య వృత్తి మానవ సేవ కోసం ఏర్పడలేదని, ఇదో పెద్ద మనోవైజ్ఞానిక వ్యాపారమనీ. రోగుల సమస్యలు అర్థం చేసుకుని సర్వీస్ ఎబౌ సెల్ఫ్ అనుకోవలసిన డాక్టర్లలో ఎంత లేసి కసాయి గుండెలవాళ్ళుంటారో నాకు అనుభవైకవేద్యం అయింది. అలా వుండలేను. అలా వుండకపోతే ఆ వృత్తిలో నిలదొక్కుకోలేనేమో. అంచేత డాక్టర్ని అవడంకంటె ఏక్టర్ని అవడం నా కిష్టం."

ధోరణి యింత ముదురు పాకాన పడినా, ప్రతిరోజు నాకు కనబడే పరమహంసతో అతని అభిప్రాయం రైటని వొప్పుకుంటూనే జీవించడానికి వొక డిగ్రీ అవసరమని బోధపరుస్తున్నాను నేను.

అతనితో 'బార్'కి వెళుతున్నానని తెలిపి సత్యనారాయణ నేను కూడా అతనితోబాటు మందు పుచ్చుకుంటానని అభాండం వేసేడు. పరమహంసని జాగ్రత్తగా రూమ్‌కి తీసుకు రావడానికే వెళుతున్నానని నేను చెపితే మాత్రం సత్యనారాయణ నమ్ముతాడా? "బారు కెళ్ళి నీరు త్రాగిన చందాన" అయింది నా పని.

ఈ రాత్రికి తప్పకుండా అతను బార్‌కి వెళతాడు. ఎందుకంటే ఇవాల్టికి వారం అయింది అతను సీసా ముట్టుకుని. పైగా నరసింహారావనే ఫ్రెండు అతని దగ్గర ఎప్పుడో ఆర్నెల్లనాడు తీసుకున్న యాభై రూపాయలు ఇవాళ తిరిగి ఇచ్చేశాడు. ఈ రాత్రి అతనికి నా పరిస్థితి అతని పరిస్థితి చెప్పేసి నీకు మందు కావాలో వైద్య

వృత్తి కావాలో తేల్చుకోమని తెగేసి చెప్పెయ్యదలుచుకున్నాను.

* * *

"అంచేత, పరమహంసా-" అన్నాను కొంత పునాది వేసిన తర్వాత.

నే చెప్పబోయేది తనకి తెలుసునన్నట్టు ఓ చెయ్యి నన్ను మాట్లాడొద్దని సంజ్ఞ చెయ్యడానికీ రెండో చెయ్యి గ్లాసు ఎత్తడానికీ వాడాడు పరమహంస.

నేను వూరుకోలేదు "అంచేత పరమ హంసా—మెడిసిన్ తొందరగా ఫినిష్ చెయ్యవయ్యా; ఇక్కణ్నించి వెళ్ళిపో వచ్చు!" అన్నాను.

"ఇదుగో, ఇంకొక్క రౌండు! అంతే" అన్నాడు పరమహంస.

"సర్లె. నేను మెడిసిన్ కోర్సుగురించి మాట్లాడుతూ వుంటే నువ్వు మందు గురించి మాట్లాడుతున్నావు" అని చికాకు పడ్డాను.

"మంచి పాటొస్తోంది వినండి గురూ గారూ" అన్నాడు పరమహంస; కొంచెం దూరంలో వున్న లౌడ్ స్పీకర్‌ను చూపిస్తూ.

"దమ్ మారో దమ్!" అని స్టీరియో లోంచి వినవస్తోంది "రస"వత్తరంగా.

లాన్‌లో టేబుళ్ళన్నీ తనిఖీ చేసు కుంటూ వొస్తున్నాడు నూకరాజు; బార్ మేనేజర్. కొన్నాళ్ళ కిందట వొక ప్రయి వేటు కంపెనీలో నేనూ అతనూ కలిసి పని చేసేం. నా దగ్గరగా రానిచ్చి. "ఏమిటి నూకరాజూ, ఎలా వుంది బిజినెస్?" అని పలకరించాను.

నా సంగతి పట్టించుకోకుండా నూక రాజూ పరమహంసా షేక్‌హాండ్లిచ్చుకుని సిగరెట్లంటించుకున్నారు

"కాస్త మంచి రికార్డులు పెట్టమన వయ్యా" అని మళ్ళీ నేనే. నూకరాజు నాకు సమాధానం చెప్పనప్పటికీ మాట్లాడాను.

"అలాగే, అలాగే—" అని వెళ్ళాడు నూకరాజు.

"మీ అన్నయ్యా వదినా, మీ అమ్మా నాన్నా అందరూ కూడానూ, నువ్వు మెడిసిన్ తొందరగా పూర్తిచేసి, మంచి ప్రాక్టీసు చేసే డాక్టరువై రెండు చేతులా సంపాదించి ఈ కోర్సుకి నీ మూలంగా వాళ్ళకైన అప్పులు తీరుస్తావని వెయ్యి కళ్ళతో యెదురు చూస్తున్నారు బాబూ, మూడ్రోజులకోసారి నువ్వు బార్ని పావనం చేస్తావు. మధ్యలో రెండ్రోజులూ నిద్ర పోతావు. ఇలా అయితే ఎప్పటికి తెమిలే ట్టు?" అని వుపదేశం మొదలెట్టాను.

"అదికాదూ;—" అని నా న్నేదు పరమహంస.

వాళ్ళన్నయ్య నాకు రాసిన ఉత్తరం తీసేను, జేబులోంచి.

స్టీరియోలో రికార్డు మారింది. ఘంట సాల భగవద్గీత ఎల్. పి. రికార్డు తగిలిం చారు. శ్లోకం అర్థం, కమ్మని కంఠం లోంచి వింటూ తన్మయం చెందుతూ ఉత్తరం అందించేను పరమహంసకి.

పరమహంస మూడోరౌండు పూర్తి చేసి, చుక్కారొట్టి ముక్కలుగా విరిచి పచ్చి బఠాణీల మసాలా కూర మీద పడ్డాడు. స్పీకర్‌వేపు చూపించి "ఇదేం ఖర్మ?" అన్నట్టొక అంగికం చేసేడు.

"నేచెప్పింది నీకేమేనా బోధపడిందా?" అన్నాను.

బేరర్ వొచ్చి బిల్లుపెట్టాడు. పరమ హంస దాన్ని తీక్షణంగా పరిశీలించి, చిల్లరతోసహా డబ్బూ, కొంత టిప్పూ సాసర్లో పెట్టాడు. బేరర్ సలాంచేస్తూ సాసర్ తీసుకెళ్ళబోయాడు.

"డబ్బు తీసుకెళ్ళు. సోపుగింజలూ టూత్‌పిక్సూ కాసేపు అక్కడ వదిలెయ్" అని ముద్దగా మాట్లాడుతూ సాసరుమీద అరిచెయ్యి మోపాడు పరమహంస.

"యస్సార్!" అని బేరర్ వెళ్ళాడు.

"ఏంటీ; ఏదో చెబుతున్నావు! ఇప్పుడు చెప్పు!" అని ఏకవచన ప్రయోగంతో మొదలెట్టాడు, లేస్తూ, పరమహంస. "మెడిసిన్ తొందరగా ఫినిష్ చెయ్యాలా? మా వూళ్ళో ప్రాక్టీస్ పెట్టాలా?....మా బ్రదర్‌కే అనుకున్నాను, నీక్కూడా బుద్ధి లేదు గురువా!....ఎంచేతంటావా? నేను చెప్తాను విను—నేను చెప్పేది అబద్ధమూ కాదు; నువ్వది విని గాభరా పడి పోనూ అక్కర్లేదు. నేన్నిజం చెప్తున్నాను ...ఏంటీ—మా వూళ్ళో జెనాభా యెంత?—తెలుసా?—తెలీదు నీకు. మా వూళ్ళో జెనాభా యనభై వేలు. మరి డాక్టర్లెంతమందున్నారో తెలుసా? ఎంత మంది?—అదీ తెలీదు నీకు—నూట ఎనభయి ఆరుగురున్నారు. ఇంకా నే నొక్కణ్ణి తక్కువయ్యానా?"

"పోనీ గవర్నమెంట్ జాబ్‌కి ట్రై చెయ్యొచ్చుగా!"

"ఏంటీ, గవర్నమెంటు జాబా? చెయ్యాలి చెయ్యాలి. ఏది జాబ్ కాదు, ట్రై చెయ్యాలి. డిఎమ్మెస్ ఆఫీసు కెప్పుడన్నా వెళ్ళావా? వెళ్ళలేదు. అక్కడెన్ని అప్లికేషన్లున్నాయో తెలుసా? తెలీదు—ఓన్లీ సిక్స్‌థౌజండ్—ఆరువేల దరఖాస్తులు మాత్రము అక్కడ పెండింగున్నవి: అక్కడా నాదొక అప్లికేషన్ తక్కువగా వుంది. అదేగా, నువ్వూ మా అన్నయ్యగాడూ చెప్పేది?"

భగవద్గీత ఉచ్చైస్వరంలో విన వస్తోంది.

"పోనీ పరీక్షలన్నీ టకటక పాసై హౌస్సర్జెన్సీ చేసేస్తే మంచిది కదుటయ్యా! ఆడపిల్లకి కన్నెచెర వదలాలి; మొగపిల్లాడికి చదువు చెర వదలాలి!" అన్నాను.

అంతే. నేనన్నది!

అందులో తప్పేమిటో నాకు తెలీదు.

అసలు తప్పుంటుందని నేను అనుకోనేలేదు.

కాని, మాట పూర్తయ్యేపరికి గూబ గుయ్యిమనేటట్టుగా కొట్టాడు నన్ను పరమహంస.

"నా ప్రాణాలు తోడేస్తున్నార్రా బాబూ. మా అన్నయ్యొకడు. ఆడు చాలక నువ్వొకడివి, మీ రిద్దరూ చాలక—" భగవద్గీత వినిపిస్తున్న స్పీకరు వేపు చూపిస్తూ "అనూకరాజూగా దొకడు!" అన్నాడు.

"బారులో తులసీదళమైనా వెయ్యొచ్చునేమో కాని బారులో భగవద్గీత వెయ్యకూడదు!"

అనుకుంటూ యివతల పడ్డాను; పరమహంసని ఆటోరిక్షావరకు నడిపించుకుని వస్తూనూ. □